# కల విరిగిన చప్పుడు




**నేనెక్కడో దారి తప్పాను. నా గది ఎక్కడుందో మరిచిపోయాను. గది రూపురేఖలు మాత్రం గుర్తున్నాయి. నా గది కోసం చాలాకాలంగా వెదుకుతున్నాను. కాని ఎక్కడా కనిపించడం లేదు. నేను ఉండే వీధి, ఆ సందులు గొందులు, ఒకానొక ఇంట్లో ఓ మూల పక్కకి ఉన్న గది... స్పష్టంగా గుర్తున్నాయి. ఆ గదిలో నా పుస్తకాలున్నాయి. డైరీలున్నాయి. కొన్ని విలువైన వస్తువులున్నాయి. వాటిని తెచ్చుకోవాలని, ఆ గది ఖాళీ చేయాలని అనుకుంటున్నాను. కాని నా గది ఎక్కడుందో నేనే మరిచిపోయాను.**

ఈ సిటీలో చాలా కాలనీల్లో, స్లమ్స్‌లో ఉన్నాను నేను. పదేళ్ళుగా నాకు ఈ సిటీతో అనుబంధం వుంది. ఎన్నో గదులు మారాను. ఎన్నో చోట్ల వున్నాను. ఎక్కడెక్కడో తిరిగాను. కానీ ఇప్పుడు జాతరలో తప్పిపోయిన పిల్లవాడిలా వుంది నా పరిస్థితి. మా ఇంటి ఓనర్ మంచివాడే. నేను ఒక్కోసారి వారం రోజుల దాకా గదికి రానని అతడికి తెలుసు. కాని ఈ సారి ఎందుకో చాలా రోజులయినట్టనిపించింది నా గదిని విడిచి వచ్చి. ఇన్ని రోజుల పాటు నేను అలా ఎందుకు తిరుగుతూ ఉన్నానో నాకే తెలియదు. కాని ఆ రాత్రి నా పాత డైరీలో రాసుకున్న మాటలు గుర్తొచ్చాయి. మళ్లీ ఎందుకో ఆ డైరీని తిరేగయాలనిపించింది. కాని పక్కన డైరీ లేదు. నా పుస్తకాలు లేవు. నాకు సంబంధించిన వస్తువులేవీ కనిపించలేదు. నేను ఎక్కడ ఉన్నానో నాకు తెలియలేదు కొన్ని క్షణాల పాటు. కిటికీ తీసాను. తలుపు తెరిచాను. అది నా గది కాదనిపించింది. ఎక్కడున్నానో తెలియలేదు చాలా సేపటివరకు. ఎక్కడుంటేనేం? అది నా గది కానప్పుడు... కానీ ఆలోచిస్తే స్ఫురణకొచ్చింది. ఆ రాత్రి పదకొండు గంటలప్పుడు నేనూ, మరో మిత్రుడు మాట్లాడుతూ నా గది నుంచి బయటికొచ్చాం. ఇరానీ హోటల్‌లో కూర్చోని చాలా సేపు మాట్లాడుతూ ఉండిపోయాం. అలా ఎంత సేపు ఉన్నానో తెలియదు. నా మిత్రుడు ఎప్పుడు వెళ్లిపోయాడో కూడా గుర్తులేదు. మళ్లీ ఆ రాత్రి నా గదికి చేరుకోలేదని మాత్రం గుర్తుంది. అప్పట్నుంచి ఎక్కడెక్కడో తిరిగాను. ఎవరెవరినో కలుస్తూ, మాట్లాడుతూ పోయాను. కాని ఇప్పుడు నా గదికి వెళ్లాలని బయలుదేరాను. రాత్రి ఒంటిగంట దాటినట్టుంది. అయితేనేం... ఖాళీగా ఉండే రాజమార్గాలన్నీ నావే కదా అనుకుంటూ బయలుదేరాను. బయటికొచ్చి నడుస్తున్నానే గానీ నా గదికి చేరుకోలేకపోయాను. అసలు నా గది ఎక్కడుందో ఎంతసేపయినా గుర్తుకు రాలేదు. అలా నడుస్తూ వీధులన్నీ తిరుగుతున్నాను. ఏ చిన్న సందు కనిపించినా లోపలి దాకా వెళ్లి చూస్తున్నాను. కానీ నేను ఉన్న సందు మాత్రం ఎక్కడా కనిపించలేదు. రాత్రి అంతా అలా నడుస్తుండగానే ఎప్పుడో తెల్లారిపోయింది. గది మాత్రం దొరకలేదు. ఏమయింది? నేను ఉన్న వీధి ఆకస్మాత్తుగా మాయమైందా? ఎవరైనా బుల్‌డోజర్లతో శిధిలం చేశారా? అదేం కబ్జా ల్యాండ్ కాదే! లేదు లేదు... నేనే మరిచిపోయాను. మళ్లీ వెదకాలి. సూక్ష్మంగా వెదకాలి. ఈ నగరంలో అంగుళం అంగుళం గాలించాలి. రోడ్డు పక్కన బండివాడి దగ్గర సింగిల్ ఛాయ్ తాగి మళ్లీ నడక మొదలెట్టాను. అలా నడుస్తూనే వున్నాను అప్పట్నించి. కానీ నా గది మాత్రం కనిపించడం లేదు. ఏమయ్యాయి నా పుస్తకాలు... నా డైరీలు... నా దిగులును, ఒంటరితనాన్ని, నాలోని ఆశనిరాశలను పంచుకున్న డైరీలు ఇప్పుడు ఎక్కడ ఉన్నాయి? నేను గదిని విడిచి వచ్చి ఎన్నాళ్ళయి వుంటుంది? అది తెలిస్తే ఈ గొడవ ఎక్కడిది? అయినా నా గడియారాన్ని చూస్తే తెలుస్తుంది కదా! మణికట్టు వైపు చూశాను. గడియారం లేదు. ఏమై వుంటుంది? ఎక్కడో పొగొట్టుకొని వుంటాను. అయినా నేను గడియారం వైపు ఎప్పుడు చూశాను గనుక. అది అలంకారప్రాయంగా వుండే తప్ప కాలం కోసం చూసింది ఎప్పుడు? పోనీ ఆ రాత్రి ఎన్నో తేదీ అయివుంటుంది? వారం, నెల ఏమై వుంటాయి? వద్దు...వద్దు... పిచ్చి ప్రశ్నలు వద్దుగాకవద్దు... కాలాన్ని కొలవడం నా పని కాదే... ఎందుకొచ్చిందీ గొడవ... పదపద... త్వరగా నా గదికి చేరుకోవాలి. ఎలాగయినా నా గది ఎక్కడుందో దొరకబట్టాలి. ఎలాగయినా దొరికించుకోవాలి. మాయం కావడానికి అదేమైనా వస్తువా? దొంగిలించుకుపోవడానికి మాత్రం ఎలా వీలు చిక్కుతుంది? లేదు.. నా గది ఎక్కడో భద్రంగానే ఉంటుంది... వెదకాలి.. వెదకాలి.. అంతే నా నడక వేగం పెరిగింది. అలా నడుస్తూనే ఉన్నాను...

***

ఆ రోజంతా ఇంట్లోనే వున్నాను. మాది చిన్న ఇల్లే. రెండు గదులు, పక్కన చిన్న వంట గది. దానికి వెనుక పెరడు. పెరట్లో తులసి మొక్క. ఇంట్లో ఉన్నది వసంత, నేనూ. ఇద్దరికీ అంతకన్నా పెద్ద ఇల్లేం అవసరం. అయినా అప్పడప్పుడు ఇల్లు సర్దే కార్యక్రమం చేపడుతుంటాం. ఏదో ఒక మార్పు చేయకపోతే మొనాటనస్‌గా అనిపిస్తుంటుంది ఇద్దరికీ. ఆ రోజు కూడా అలానే అనుకుంటూ ఇల్లు సర్దడానికి ఉపక్రమించాం. మా పడక గది రూపురేఖలే మార్చి వేశాం. ఎప్పుడూ ఉండే విధంగా కాకుండా గదిలో ఉత్తరం వైపు కిటికీ దగ్గరకు మంచాన్ని తిప్పాం. మాది నవారు మంచం. నవారు విప్పి మళ్లీ గట్టిగా కట్టాం. మా ఇంటికి వచ్చిన వాళ్ళంతా 'డబుల్ కాట్ బెడ్స్ కొనకపోయారా' అనే వాళ్ళు. కాని ఆ మాటల్ని ఎప్పుడూ పట్టించుకోలేదు మేం. నవారు మంచంలో ఉండే సౌఖ్యం మరేందులోనూ ఉండదనిపించేది మాకు. అందుకే ఎవరయినా ఆ మాట అన్నప్పుడు నవ్వి వూరుకొనే వాళ్ళం. మంచం మీది బెడ్ షిట్స్ మార్చాం. ఆ తర్వాత కిటికీ తెరలు మార్చాం. అందుకోసం వసంత పసుపు రంగు చీరను మూడు ముక్కలు చేసింది. ఆ చీరంటే నాకు ఎంతో ఇష్టం. "అయిదేళ్ళయిపోయిన చీరను ఇంకా ఏం కడతాను. కావాలంటే నీ కోసం మరో పసుపు రంగు చీర కొనుక్కుంటాను లేవోయ్" అంటూ ఆ చీరను ముక్కలు చేసి, కిటీకీలకు అమర్చింది. దాంతో కిటికీలు కూడా కొత్త అందాలను సంతరించుకున్నట్టనిపించింది. నా పుస్తకాలను కూడా సర్దాను. వసంత వీణను శుభ్రం చేసింది. దాని స్థానాన్ని కూడా మార్చింది. ఇప్పుడు అది ముందు గది లోంచి మా పడకగదిలోకి మారింది. దాంతో మా గది స్వరూపమే మారిపోయినట్టనిపించింది. మంచాన్ని మునుపు ఉన్న స్థానం నుంచి మార్చడంతో గది అంతా ఎంతో విశాలంగా ఉన్నట్టనిపించింది. వీణ కూడా మా గదిలోకి రావడంతో సంగీతం మా అంతరాల్లో, మా శరీరాల్లో కలగలిసిపోయినట్టనిపించింది. అలా ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటల వరకు ఇల్లు సర్దడంతో సరిపోయింది. ఆ తర్వాత ఇద్దరం అభ్యంగ స్నానాలు చేశాం.



అన్నాలు తిన్నాక కాస్సేపు క్యారమ్స్ ఆడాం. ఆ తర్వాత అష్టాచెమ్మా ఆడాం. దాడి ఆడాం. కిటికీలోంచి నీరెండ వడి మా ఇద్దరి మధ్య పరుచుకునేంతవరకు అలా ఆడుతూ ఉండిపోయాం. అదే సమయాన సురేష్, శారద వచ్చారు. వాళ్ళతో కాస్సేపు మాట్లాడాక వసంత లోపలికి వెళ్లింది. అప్పుడే పంపు రావడంతో మంచి నీళ్ళు పట్టుకురావడానికి బిందెతో పెరట్లోకి వెళ్లింది. శారద మా కన్నా ఎక్కువ అల్లరి పిల్ల... ఏదేదో చెబుతుంది... అష్టాచెమ్మ ఆడేందుకు మేం బండల మీద గీసిన గీతలను చూసి తన చిన్నప్పటి జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయింది. చిన్నప్పుడు తాను అక్కచెల్లెళ్ళతో అష్టాచెమ్మ, చెమ్మచెక్కలాటలు ఎలా ఆడేదో చెబుతూ పోయింది. వసంత నీళ్ళ బిందెతో వంట గదిలోకి వెళుతుంటే సహాయం చెద్దామని లేచాను. "నువ్వు ఆడుకోవోయ్, రెండు బిందెలే కదా నేను తెస్తానులే" అంటూ బిందె దింపి, మళ్ళీ పెరట్లోకి నడిచింది. వసంతలో అలా ఒక్కోసారి కనిపించే అమ్మతనం నన్ను మరింత పిల్లవాడ్ని చేస్తుంది. దాంతో మళ్లీ మా గదిలోకి వచ్చి ఆటల్లో పడ్డాను. సురేష్, నేను చిన్నపిల్లాళ్ళలా కొట్లాడుకుంటున్నాం. ఎవరి బలమెంతో తేల్చుకోవాలని, ఇద్దరం ఒకళ్ళ కాళ్ళకు మరొకళ్ళ కాళ్ళను ఆనించి పోట్లాడుకుంటున్నాం. శారద మా ఆటను చూసి ఉత్సాహంతో తనూ అటు ఇటు ఎగురుతూ ఆడుతోంది. లోపలికి వచ్చిన వసంత "ఆడుకోవాలి గానీ, కొట్టుకోకూడదురా పిల్లలూ" అంటూ మమ్మల్ని విడదీసి చెదిరిన నా జుట్టు సర్దింది. ఎందుకో మా అమ్మే గుర్తుకు వచ్చింది మళ్లీ. అలా చాలా సేపు ఆటపాటలతో గడిపాక సురేష్, శారద వెళ్లిపోయారు. ఆ రాత్రి మళ్లీ అమ్మ గుర్తుకొచ్చింది. అమ్మ చనిపోయి రెండేళ్ళయింది. కానీ అమ్మ గుర్తుకురాని రోజు లేదు నాకు. నా కళ్ళల్లో నీళ్ళు చూసి వసంత చలించిపోయింది. నన్ను తన దగ్గరకు తీసుకొని "అమ్మ గుర్తుకొచ్చిందరా కన్నా" అంటూ నా తల నిమురుతూ లాలించింది. నా కన్నీళ్ళు తుడిచి దగ్గరకు తీసుకొని నుదుటి మీద ముద్దు పెట్టి "దిగులుగా వుందా కన్నా! నేను ఉన్నాను కదరా! నన్ను నీ అమ్మనే అనుకోరా!" అంటూ ఓదార్చింది. ఈ లాలన లేకపోతే నేనేమయిపోయేవాడినో నాకే తెలియదు. వసంతే లేకపోతే నేను మనిషిగా మిగిలేవాడిని కాదు. ఆమె నన్ను జోకొడుతూ పాట పాడటం మొదలెట్టింది. అమ్మకు ఇష్టమైన పాట, నాకు ఇష్టమైన పాట... నాలో కొత్త ద్వారాలను తెరిచే ఆ పాట వింటూ నేను ఎప్పుడు నిద్రలోకి జారిపోయానో తెలియదు.



భయంకరమైన వాస్తవాలన్నీ కలలో మేల్కొన్నాయి. అసలు నిజం చెదిరిపోయింది. మళ్లీ నేను దారితప్పాను. అప్పటివరకు నన్ను అలరించే జీవితం ఒక కల మాత్రమేనా... వాస్తవం కాదా... నాలో నాకు తెలియకుండా చెలరేగే తుఫాను... నిజమే... నిజంగా తుఫాను... జోరున వర్షం... ఈదురుగాలి... గుడిసె మీద తాటాకు కమ్మలు ఎగిరిపోతున్నట్టుంది. చూరుల్లోంచి వర్షం నీళ్ళు... అమ్మ, అక్కయ్యలు చూరుల్లోంచి నీళ్ళు కారే చోటల్లా పళ్లాలను, చెంబులను, గిన్నెలను ఉంచుతున్నారు. అయినా ఎక్కడో చోట నుంచి వాన నీళ్ళు కారుతూనే ఉన్నాయి. వాటన్నిటికి సరిపోను పాత్రలేం లేవు ఇంట్లో. నా మొద్దు నిద్ర ఎప్పుడో తేలిపోయింది. నా పక్క కిందకు వేసిన బస్తాను జరుపుకుంటూ నేను ఓ మూలకు నక్కి నక్కి కూర్చున్నాను. చలికి వణికిపోతున్నాను. అమ్మ, అక్కయ్యలు కూడా అలా తలా ఓ మూలకు జరిగి కూర్చున్నారు. దీపం ఎప్పుడో ఆరిపోయింది. చీకట్లో ఎవరి ముఖాలు ఎవరికీ కనిపించడం లేదు. చీకట్లో పాములు వస్తాయేమోననే భయం... అనుకున్నట్టుగానే నా కాలు దగ్గర్నించి ఏదో పాకుతూ పోయింది. "అమ్మా భయమేస్తుందే" అని ఏడుపు గొంతుతో అన్నాను. "ఇటురారా కన్నా, ఎందుకు భయం నేను ఇక్కడే ఉన్నాను కదా" అంటూ అమ్మ పిలిచింది. అంత వర్షంలోనూ అమ్మ గొంతులోంచి ఒలికిన ఆప్యాయత ఒకింత ధైర్యాన్నిచ్చింది నాకు. మెల్లగా లేచి చూరుల్లోంచి కారే నీళ్ల మీద పడుతుండగా అమ్మ దగ్గరికి చేరాను. అమ్మ ఒళ్ళో దూరి వెచ్చగా పడుకున్నాను... అంతలో ఎక్కడో పిడుగుపడ్డట్టుగా భయంకరమైన శబ్దం... అమ్మ నన్ను గట్టిగా దగ్గరగా కరుచుకొని 'అర్జునా... అర్జునా' అంది. నా వీపు మీద భయం లేదన్నట్టుగా తట్టింది... కానీ ఏదో దిగులు, భయం... అలా ఎంత సేపు పడుకున్నానో తెలియదు. కానీ నిద్రలో ఎక్కడో జారిపోయినట్టుగా అనిపించింది. మళ్లీ మెలుకువ రాలేదు. నిజంగా అది నిద్రా? కలా? వాస్తవమా? కాని ఎక్కడికో జారిపోతున్నట్టుగా అనిపించింది... ఎక్కడికి? ఎక్కడికి?... ఎక్కడికో...!

*** ***

వరుగు వరుగు... వరుగు లాంటి నడక... నడకలాంటి వరుగు... ఎక్కడెక్కడెక్కడ నా గది ఎక్కడ... ఎక్కడెక్కడ... ఏమైపోయాను... నా గది ఏమైపోయింది... వరుగు వరుగు వరుగులాంటి నడక... నడకలాంటి వరుగు... ఎక్కడికి? ఎక్కెడెక్కడెక్కడెక్కడికి? అరే, జారిపోతున్నాను. జారిపోతున్నాను... ఎక్కడివీ పర్వతాలు... గుట్టలు... ఎక్కడిదీ అగాథం? కాలి కింది మట్టి కూడా జారిపోతుంది? ఎవరు... ఎవరెవరెవరెవరు? ఇందాకటి ఆటలేవీ? పాటలేవీ? 'వసంత'మేది? నీ జీవితంలో వసంతం కూడానా? అదేమిటి? కలా? నిజమా? కల చెదిరింది... కనుగుడ్డు పగిలింది. రెండు ముక్కలయింది. అన్నీ రెండుగా కనిపిస్తున్నాయి. నా చేతులేమిటి? ఇటు రెండు చేతులు... అటు రెండు చేతులు... ఇటు ఒక రోడ్డు.. అటు ఒక రోడ్డు... నేనేమిటి? నేనేనా? నువ్వు నేను...నువ్వే నేను...నేనే నువ్వు...కాదు రెండు నేనులు నేనే... అదిగదిగో సిటీబస్సు... రెండు బస్సులు...పరిగెత్తు...ఏదో ఒకటి అందుకో... ఈ బంజారా గుట్టల దాటుకు పరిగెత్తు... క్యాచ్ ద బస్... స్టాప్...స్టాప్... స్టాప్... ఏదీ ఇంత అరుస్తున్నా వినిపించుకోదేం. అసలు గొంతు పెగులుతుందా? అవును మాట గొంతు దాటడం లేదు. నోరు పెగలడం లేదు. నడక గుట్టలను దాటడం లేదు. బంజారా కొండలు... బండరాళ్ళ మధ్య ఇళ్ళు...ఇళ్ళల్లో రాతి గుండెలు... గుండెల్లోకి ఇంకే విదేశీ మద్యం... మత్తుగా గమ్మత్తుగా గదిలో సోలిన రోజులేవీ? అసలు నా గది ఏదీ? ఈ కొండరాళ్ళ మధ్యకు నా గదిని వెధుక్కుంటూ వచ్చానా? ఇక్కడనా? ఇక్కడనా? లేదు...లేదు లేదుగాక లేదు. నా గది ఆ సందుల గొందుల్లోనే వుంటుంది. ఈ రాచ మార్గాల మధ్యన లేదు. ఈ కొండరాళ్ళ మధ్య, బలిసిన కావలికుక్కల ఇళ్ళ మధ్య వుండదు గాక వుండదు. వీధికుక్కలే నా గదికి శ్రీరామరక్ష బల్దియా వాడు దాడి చేయకపోతే. పరిగెత్తాలి. వెదకాలి. నా గదికి వెళ్లాలి... నా పుస్తకాల మధ్య విశ్రమించాలి. చలో యార్... అడ్డంగా పడిపో... అడ్డదారుల్లో పడిపో... నీ గదికి రాజమార్గాలు లేవు... అడ్డదారులే శరణ్యం...పోపోపో...అడ్డంగా పడిపో... "అమ్మా" నిజంగానే పడిపోయాను. కాలి వేలు చితికింది. రక్తం... రక్తం... "అమ్మా" ...ఎక్కడుంది అమ్మ? అమ్మ ఇప్పుడు గుర్తు వచ్చిందా? అవును అమ్మ ఏది? ఎక్కడ అమ్మ? ఏది అమ్మ? అమ్మ ఏది? అమ్మ చచ్చిపోయింది. కాదుకాదు చంపుకున్నాను... పల్లె పొలిమేరను దాటి పట్నం నాజూకు రోడ్ల మీద అడుగుపెట్టిన రోజునే అమ్మను చంపుకున్నాను... "నువ్వు డబ్బులు పంపనక్కర్లేదు... ఒక్కసారి, ఒక్కసారి వచ్చిపోరా కన్నా" అని రాయించిన ఉత్తరాలు ఎన్ని? ఎన్నెన్ని? అమ్మకు 'అమ్మ'ను చదివి వినిపించాలని కన్న కలలు...కల్లలు... కల్లలు... కల్లలు... బతుకే ఒక పెద్ద అబద్ధం... 'అమ్మ' అయినా భద్రంగా వుందా? చెదలు పట్టాయా? అమ్మనే ఈ నేలలో కలిసిపోయింది. ఇక 'అమ్మ' మాత్రం ఏమైతేనేమిటి? లేదు 'అమ్మ' చెదపట్టిపోకూడదు. అమ్మా నేనూ చిన్నప్పుడు రూపాయి పెట్టి తీయించుకున్న ఫోటో 'అమ్మ'లోనే వుంది. వెళ్లాలి... అమ్మను చూడాలి... ఎక్కడెక్కడెక్కడ? నా గది ఎక్కడ? ఎంతకీ గుర్తుకురాదేం.. ఎలా మరిచిపోయాను నేను నా గదిని...లేదు వెళ్లాలి...వేగంగా వెళ్లాలి... అడుగు తీసి అడుగు వేస్తుంటే కాలు నొప్పి... ఇలా కాదు. ఇలా కుదరదు. అంగదుడిలా వెళ్లాలి. ఎగురుకుంటూ వెళ్లాలి... వదవదవద దవదవదవ...వద... ఒకదాని తర్వాత ఒకటి బండరాళ్ళను దాటుకుంటూ వెళ్లాలి... మళ్లీ నగరం మధ్యన పడాలి. నా గదిని వెదకాలి... దాటాలి... ఈ బండరాళ్ళను, తుమ్మ చెట్లను దాటాలి... అదిగో జంప్‌యార్... జంఫ్ జంప్...జంప్... వద్దు వద్దు వద్దు జారిపోతావు... కుడికాలు లేచింది అంతే... అయిపోయింది... ఎత్తయిన పర్వతం మీంచి జారిన బండరాయి వలె పాతికేళ్ళ శరీరం దొర్లుకుంటూ పోయింది. ముళ్ళ కంపల మీదుగా, బండరాళ్ళ మీదుగా, వేగంగా వేగంగా... దొర్లుకుంటూపోయింది... నాదేనా ఈ శరీరం నాదేనా? నేనేనా? అంతా చీకటి? పగలే చీకటి... ఆకాశం నల్లరంగును పులుముకుంది... గాలి స్తంభించింది.. ఊపిరి బిగబట్టిన దృశ్యం... భారంగా కళ్ళు మూతలు పడుతున్న దృశ్యం... కల విరిగిన చప్పుడు...!!